నేటినుంచి నామినేషన్లు..

ఏర్పాట్లు చేసిన అధికారులు..

షేక్‌పేట్ తాసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన జూబ్లీహిల్స్ రిటర్నింగ్ కార్యాలయం

జూబ్లీహిల్స్, నవంబర్ 2 : అసెంబ్లీ ఎన్నికలకు తొలి అడుగు పడనుంది. నేటినుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి ఎన్నికల అధికారులు నామినేషన్లు స్వీకరించనున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి బంజారాహిల్స్‌లోని షేక్‌పేట్ తాసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ కార్యాలయంలో అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ప్రతిరోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ మేరకు గురువారం సికింద్రాబాద్ ఆర్డీఓ, జూబ్లీహిల్స్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ టి.రవి, డిప్యూటీ కలెక్టర్ శివకుమార్‌తో కలిసి ఏర్పాట్లపై సమీక్షించారు. అభ్యర్థులు నామినేషన్ వేసే సమయాన్ని ఖచ్చితంగా నిర్ధారించేందుకు రిటర్నింగ్ కార్యాలయంలో పెద్ద గోడ గడియారాన్ని ఏర్పాటు చేశారు. నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థులు అడుగడుగును రికార్డు చేసేందుకు సీసీ కెమెరాల నిఘాతో పాటు ఫొటోగ్రాఫర్, వీడియోగ్రాఫర్‌ను ఏర్పాటు చేశారు. ఎన్నికల నియమావళి ప్రకారం నామినేషన్ల స్వీకరణ చేపడుతామని ఆర్వో రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఈఆర్‌ఓ సేవా ఎస్లావత్, ఏఈఆర్‌ఓలు బాలరాజ్, నయూముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత కట్టుదిట్టం చేయాలి..

జూబ్లీహిల్స్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ రవి

యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న ఆర్వో రవి

జూబ్లీహిల్స్, నవంబర్ 2 : స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత కట్టుదిట్టం చేయాలని సికింద్రాబాద్ ఆర్డీఓ, జూబ్లీహిల్స్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ టి.రవి అధికారులను ఆదేశించారు. గురువారం యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో స్ట్రాంగ్ రూమ్‌లను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఎన్నికల సామగ్రి భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల సమీపంలోకి ఎవరినీ అనుమతించవద్దని.. ప్రతిరోజు సీల్‌ను చెక్ చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ డేకు ముందు రోజు అన్ని రాజకీయ పక్షాల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లను తెరుస్తామని తెలిపారు. తదనంతరం ఆయా పోలింగ్ స్టేషన్లకు ఎన్నికల సామగ్రిని భద్రతా ఏర్పాట్లతో తరలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఈఆర్‌ఓ సేవా ఎస్లావత్, యూసుఫ్‌గూడ సర్కిల్ ఏఎంఓహెచ్ డాక్టర్ కె.ఎస్.రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి..

జూబ్లీహిల్స్, నవంబర్ 2 : ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని మాస్టర్ ట్రైనర్ వాణి పార్వతి పేర్కొన్నారు. గురువారం షేక్‌పేట్ నారాయణమ్మ కాలేజీలో పోలింగ్ ఆఫీసర్స్ శిక్షణ కార్యక్రమంలో పోలింగ్ ఆఫీసర్స్‌కు ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. నోడల్ అధికారి హిమబిందు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సేవా ఎస్లావత్, ఏఈఆర్‌ఓలు బాలరాజు, కమల్, డిప్యూటీ ఈఈ శ్రీరాములు పాల్గొన్నారు.

యాదగిరినగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే గోపీనాథ్

ఎన్నికల ప్రచారంలో భాగంగా వెంగళరావునగర్ డివిజన్‌లో జూబ్లీహిల్స్ నియోజవర్గంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి కరపత్రాన్ని ప్రజలకు అందజేస్తున్న ఎమ్మెల్యే మాగంటి

ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్

- వెంగళ రావునగర్ డివిజన్‌లో ఎమ్మెల్యే మాగంటి ప్రచారం..
- మద్దతు తెలిపి.. ఆశీర్వదించాలని వేడుకోలు

వెంగళరావునగర్, నవంబర్ 2: శాసనసభ ఎన్నికల ప్రచారంలో కారు స్పీడ్‌తో దూసుకుపోతుంది.. ప్రతిపక్షాలు బేజారవుతున్నాయి. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ గురువారం వెంగళరావునగర్ డివిజన్, యాదగిరినగర్‌తో పాటు పలు గల్లీల్లో పాదయాత్ర, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో అన్ని రంగాలను అభివృద్ధి చేస్తున్నారాన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందన్నారు. సీఆర్ సహకారంతో వేల కోట్లతో నియోజవర్గంలో అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రజలు మరోసారి తమ సంపూర్ణ మద్దతు అందించి ఆశీర్వదించాలని కోరారు. వారి మద్దతుతో మూడోసారి అసెంబ్లీలో అడుగు పెడతానన్నారు. ప్రచారంలో అడుగడుగునా మాగంటికి జనం నీరాజనాలు పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దేదీప్య రావు, రామకృష్ణ, వేణు, చిన్న రమేశ్, శ్యామ్‌రావు, అంజనేయులు, శ్రీనివాస్ గౌడ్, సత్య, పవన్ ముదిరాజ్, పూజారి బాలరాజు , తదితరులు పాల్గొన్నారు.

మాగంటి విజయం ధ్యేయంగా ప్రచారం ..

సాయిబాబానగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నేతలు

వీకర్‌సెక్షన్ బస్తీలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ఎర్రగడ్డ, నవంబర్ 2: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించడమే ధ్యే యంగా గులాబీ సేన ముందుకు వెళ్తున్నది. మాగంటికి మద్దతుగా ఎక్కడికక్కడ పార్టీ శ్రేణులు ప్రచారాన్ని ఉధృతం చేశారు. బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలో బూత్‌ల వారీగా జరుగుతున్న ప్రచారం తో వీధులన్నీ గులాబీమయంగా దర్శనమిస్తున్నాయి. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో జరుపుతున్న ఇంటింటి ప్రచారానికి అన్ని వర్గాల నుంచి విశేష స్పందన వస్తున్నది. ఇందులో భాగంగా గురువారం ఎర్రగడ్డ డివిజన్, శంకర్‌లాల్‌నగర్‌లో డివిజన్ అధ్యక్షుడు సంజీవ, రాము, సెబాస్టిన్ తదితరులు.. ఇంటింటి ప్రచారం నిర్వహించి.. కారు గుర్తుకు ఓటువేయాలని కోరారు. బోరబండ డివిజన్ సాయిబాబానగర్‌లో జరిగిన ప్రచారంలో పార్టీ నేతలు రమేశ్‌నాయక్, ఏడీ మధు, వెంకటేశ్వర్‌రావు, పెద్దిరాజు, రవీందర్, పవన్, వెంకటాద్రి, సుధాకర్, జేమ్స్, హరి, నాగిరెడ్డి, గిరి, తదితరులు పాల్గొన్నారు. అలాగే..వీకర్‌సెక్షన్ బస్తీలో సీనియర్ నేత విజయకుమార్, ఎండీ యూసుఫ్, బాబూరావు, ముంతాజ్‌బేగం, ఇష్రత్‌బేగం, సురేశ్, ఖాతూన్‌బీ, నూర్జహాన్‌బేగం, సరస్వతి, సురేఖ, అల్కా, రాణి, సీత, మహబూబ్‌బీ , తదితరులు పాల్గొన్నారు.

ముహూర్తం మంచిగున్నదా..?

నామినేషన్ వేసేందుకు మంచి గడియల కోసం ఆరా..!

జూబ్లీహిల్స్, నవంబర్ 2: అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చే ఓట్ల పండుగకు సమయం రానేవచ్చింది. ఐదేండ్లు అధికార అంద లాన్ని ఎక్కించే ఎన్ని'కలలో' తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో నేటినుంచి ఎన్నికల సంఘం నామినేషన్లు స్వీకరించనుండగా అభ్యర్థులు తమ నామినేషన్లు సమర్పించేందుకు ముహూర్తాలు బాగున్నాయా? అని ఆరా తీస్తున్నారు. మంచి గడియలో నామినేషన్ వేసి విజయతీరాలకు చేరేందుకు ఉవ్విల్లూరుతున్నారు. ఈనెల 3 నుంచి 15 వరకు నామినేషన్లు స్వీకరించనుండగా ఈ మధ్య కాలంలో ఏ రోజు మంచిదిగా ఉందని.. ఏ సమయంలో శుభ గడియలున్నాయని పండితులను, పురోహితులను ఆరా తీస్తున్నారు. ఒకవైపు ముమ్మరంగా ప్రచారాలు చేపడుతూనే మరోవైపు మంచి ముహూర్తాల కోసం వెతుకులాడుతున్నారు. ఈ పది, పదకొండు రోజుల కాలంలో మంచి రోజులు, శుభ గడియలు తెలుసుకునేందుకు ప్రత్యేక నెట్‌వర్క్‌లను సైతం ఏర్పాటు చేసుకుంటున్నారు. అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు విజయం తమనే వరించేలా మంచి సమయంలో నామినేషన్లు వేసేందుకు ముహూర్తం చూసే పనిలో పడ్డారు.

మయూరికి ఓయూ డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 2: ఉస్మానియా యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ విభాగంలో డి. మయూరి డాక్టరేట్ సాధించారు. ప్రొఫెసర్ చంద్రిక పర్యవేక్షణలో 'ఎ స్టడీ ఆన్ గ్రీన్ హెచ్‌ఆర్ ప్రాక్టీసెస్ ఇన్ సెలెక్ట్ ఆర్గనైజేషన్స్'అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులు ఆమెకు పీహెచ్‌డీ పట్టాను ప్రదా నం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆమె రెండు రోజుల క్రితం జరిగిన 83వ ఓయూ స్నాతకోత్సవంలో అడోబ్ సీఈ వో శంతను నారాయణ్ చేతుల మీదుగా పట్టాను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

ప్రొఫెసర్ కృష్ణారావు సేవలు చిరస్మరణీయం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 2: ఉస్మానియా యూనివర్సిటీ ఫిలాసఫీ విభాగం ప్రొఫెసర్, నల్గొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణారావు వర్సిటీకి అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. ప్రొఫెసర్ కృష్ణారావు ఇటీవల పదవీ విరమణ చేసిన సందర్భంగా ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆయనకు వీడ్కోలు సభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పలు బాధ్యతలు నిర్వర్తించి, ఎల్లప్పుడూ విద్యార్థులకు అందుబాటులో ఉండేవారని గుర్తు చేసుకున్నారు.